- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
30-04-2026

సంపుటి : 01 సంచిక :39 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 39 NAMASTEY MAHAAPRABHA

## టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయి



- ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణ
- బాలికలు 96.26 శాతం, బాలురు 94.07
- సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం పాస్
- 5,731 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత
- ములుగు ఫస్ట్...హైదరాబాద్ లాస్ట్

హైదరాబాద్ ఏప్రిల్ 29(మహ ప్రభ)

రాష్ట్రంలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2.19 శాతం అధిక ఉత్తీర్ణతతో బాలుర కంటే బాలికలుపై చేయి సాధించారు. బాలికలు 96.26 శాతం, బాలురు 94.07 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలల యాజమాన్యాల వారీగా చూస్తే -మిగతా 3 లో

## హెడ్, క్లాసెన్ మ్యాజిక్..

### ముంబైపై రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన సన్‌రైజర్స్.

- ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ వరుసగా ఐదో విక్టరీ
- ముంబై ఇండియన్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం
- 244 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన ఆరెంజ్ ఆర్మీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 29(మహ ప్రభ)

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగుతోంది. వాంఖడేలో ముంబైని ఓడించి.. ఈ టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. దీంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ముంబై ఇండియన్స్‌తో మ్యాచులో రికార్డు స్థాయిలో -మిగతా 3 లో

## 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడి హట్టి

### మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిదే

- 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు సమస్యరాదు
- ముంపు వాటిల్లితే పరిహారానికి ప్రభుత్వం సిద్ధం
- సమన్వయం బాధ్యత ఉత్తమ్‌కు అప్పగింత
- నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- ఆదిలాబాద్‌తో పాటు రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగు నీరు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 29(మహ ప్రభ)

తుమ్మిడిహట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. -మిగతా 3 లో





## పశ్చిమబెంగాల్‌లో పోటెత్తిన ఓటర్లు

- రెండో విడతలో 91 శాతానికిపైగా పోలింగ్
- పలుచోట్ల చెదురుమదురు ఘటనలు
- మొరాయించిన ఈవీఎంలు మే 4న తుది ఫలితాలు

కోల్‌కతా ఏప్రిల్ 29(మహ ప్రభ)

పశ్చిమ బెంగాల్‌లో ఓటేసేందుకు ఓటర్లు పోటెత్తారు. దీంతో రెండో విడతలో 91 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం గా ముగిసింది. మరికొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. పశ్చిమబెంగాల్‌లో 294 స్థానాలు ఉండగా మొదటి విడతలో 152 నియోజకవర్గాలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరిగింది. ఇందులో 93 శాతం ఓటింగ్ నమోదైంది. బుధవారం రెండోవిడతలో 142 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో 1,448మంది అభ్యర్థులు బరిలో నిల్చోగా 3.21 కోట్ల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని నిక్షిప్తం చేశారు. ఇందుకోసం 41వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది.

బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ నేపథ్యంలో ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. భవానీపుర్ నియోజకవర్గంలో సీఎం మమతా బెనర్జీ -మిగతా 3 లో

## అధికారం రావడం.. పోవడం రొటీన్ వ్యవహారం

- హామీలు గుప్పించి..ప్రజలను మోసం చేస్తున్న రేవంత్
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కేసీఆర్ ఆనాడే హెచ్చరించారు
- రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 29(మహ ప్రభ)

అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. -మిగతా 3 లో



## ఎన్‌డీయే కూటమి హ్యాట్రిక్..

- అసోంలో మళ్లీ విజయం అధికార ఎన్‌డీయేదే

3

## అమరావతిలో ఫైనాన్స్ సిటీ

- సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ స్థానంలో నిర్మాణం
- ఆదాయార్జనే లక్ష్యం
- త్వరలో అధికారిక ప్రకటన

అమరావతి ఏప్రిల్ 29(మహ ప్రభ)

రాజధాని అమరావతిలో సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ స్థానంలో ఫైనాన్స్ సిటీని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే వివిధ దేశాలకు సంబంధించిన సంస్థలతో సంప్రదింపులు జరిపి, ప్రాథమిక ప్లానింగ్ రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఫైనాన్స్ సిటీ నిర్మాణం గురించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ -మిగతా 3 లో



## తండ్రికి విలువ ఇవ్వని కవిత... అమ్మ ఎలా అవుతుంది

- అన్నమీద కోపంతో తండ్రిని తిడితే ఎలా
- ఎంతయినా కేసీఆర్ ఉద్యమకారుడు కదా
- కేసీఆర్ లేకుంటే కవిత ఎక్కడ ఉండేవారు
- లిక్కర్ కేసులో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదు
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



యాదాద్రిభువనగిరి, ఏప్రిల్ 29(మహ ప్రభ)

తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. ఈ మేరకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవితపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కవిత పార్టీ పెట్టడం.. అది కూడా టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదమన్నారు. కూతురికి తండ్రి -మిగతా 3 లో



## ప్రజాదరణ కోల్పోతున్న ట్రంప్

- ఇరాన్ యుద్ధం, గ్యాస్ ధరల పెరుగుదలపై ప్రజాగ్రహం
- రిపబ్లికన్లలోనూ వ్యతిరేకత

వాషింగ్టన్ : ఏప్రిల్ 29(మహ ప్రభ)

అమెరికా అధ్యక్షులుగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత డోనాల్డ్ ట్రంప్ మున్నెన్నడూ లేని విధంగా ప్రజాదరణ కోల్పోయారు. నాలుగు రోజుల పాటు రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన తాజా పోల్‌లో కేవలం 34 శాతం మంది మాత్రమే ట్రంప్ పనితీరును సమర్థించారు. ఈ సర్వేకు ముందు ఈ నెల 15-20 తేదీల మధ్య జరిగిన మరో పోల్‌లో ఆయనకు 36 శాతం మంది మద్దతు తెలిపారు. గత జనవరిలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో ఆయనను 47 శాతం మంది సమర్థించడం గమనార్హం. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయిల్ దళాలు ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత ట్రంప్ రేటింగ్ మరింత దిగజారింది. యుద్ధం కారణంగా గ్యాసోలిన్ ధరలు బాగా పెరిగాయి. ప్రజల జీవన వ్యయానికి సంబంధించి ట్రంప్ పనితీరును కేవలం 22 శాతం మంది మాత్రమే సమర్థించారు. రాయిటర్స్/ఇప్సోస్ సర్వేకు ముందు ఈ రేటింగ్ పాతిక శాతంగా ఉంది. జీవన వ్యయంపై అడిగిన ప్రశ్నకు రిపబ్లికన్లు సైతం ట్రంప్ పనితీరుపై పెదవి విరిచారు. 41 శాతం మంది ఆయనను వ్యతిరేకించారు. ట్రంప్ హయాంలో జీవన వ్యయం పెరిగిందని తటస్థులలో 71 శాతం మంది అభిప్రాయపడ్డారు. -మిగతా 3 లో

## రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు

### 90 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం



- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మిల్లులకు చేరిన 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్ 29(మహ ప్రభ)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు పక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, -మిగతా 3 లో

## ఇకపై మంచిగా ఉండను.. మరింత దూకుడుగా వెళ్తా..

- ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



3

# తమిళనాడులో మళ్లీ డీఎంకేదే విజయం..

## ఎగ్జిట్‌పోల్ సర్వేల అంచనాలు




**న్యూఢిల్లీ: ఏప్రిల్ 29(మహ ప్రభ)**
: తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ తోపాటు పుదుచ్చేరి , అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేటితో ముగిసింది. పశ్చిమబెంగాల్‌లో రెండు విడతల్లో మిగతా అన్ని చోట్ల ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. బెంగాల్‌లో రెండో విడత పోలింగ్ జరిగింది. దాంతో పోలింగ్ ప్రక్రియ పూర్తిగా ముగిసనట్లయ్యింది. ఈ క్రమంలో జాతీయ సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను విడుదల చేశాయి. తమిళనాడులో అధికార డీఎంకేనే మళ్లీ సీఎం పీఠాన్ని దక్కించుకుంటుందని ఎగ్జిట్ పోల్ సర్వేలు అంచనా వేశాయి.తమిళనాడులో డీఎంకే కూటమి మరోసారి అధికారం చేపడుతుందని మెజారిటీ సర్వే సంస్థల అంచనాలు స్పష్టంచేస్తున్నాయి. అయితే నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ గణనీయమైన ఓట్లను సాధించి తమిళనాడు రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరిస్తుందని ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు తెలుపుతున్నాయి. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకుగాను డీఎంకే కూటమి 125-145 దక్కించుకుని మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకుంటుంది. ప్రతిపక్ష అన్నాడీఎంకే కూటమి 65-80 స్థానాలు గెలుస్తుంది. ఇక విజయ్ నేతృత్వంలోని టీవీకే 18-24 స్థానాలు సాధిస్తుంది.ఇక మ్యాట్రిజ్ సర్వేసంస్థ అంచనా ప్రకారం.. డీఎంకే కూటమి 122-132 స్థానాలు గెలిచి అధికారంలోకి వస్తుంది. అన్నాడీఎంకే కూటమి 87-100 స్థానాలు సాధిస్తుంది. టీవీకే పార్టీకి 10-12 స్థానాలు దక్కే అవకాశం ఉంది. అదేవిధంగా చాణక్య స్ట్రాటజీస్ సర్వే ప్రకారం.. డీఎంకే కూటమి 145-160 స్థానాలు సాధించి భారీ మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకోనుంది. అన్నాడీఎంకే కూటమి 50-65 స్థానాలు మాత్రమే గెలువనుంది. విజయ్ టీవీకే పార్టీ 13-18 స్థానాలు దక్కించుకోనుంది.ఇక సీఎన్ఎన్-న్యూస్18 సర్వే ప్రకారం.. ప్రతిపక్ష అన్నాడీఎంకే కూటమికి అధికార డీఎంకే కూటమి కంటే ఎక్కువ శాతం ఓట్లు పోలవనున్నాయి. అన్నాడీఎంకే కూటమికి 39.9 శాతం ఓట్లు రానున్నాయి. డీఎంకే కూటమి 38.9 శాతం ఓట్లు దక్కనున్నాయి. ఇక విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 15.8 శాతం ఓట్లతో ఫలితాలను ప్రభావితం చేయనుంది.

# ఢిల్లీ హైకోర్టులో షాకింగ్ ఘటన.. వర్చువల్ కోర్టులో పోర్న్ వీడియోలు




**న్యూఢిల్లీ: ఏప్రిల్ 29(మహ ప్రభ)**
ఢిల్లీ హైకోర్టు లో షాకింగ్ ఘటన చోటుచేసుకున్నది. వర్చువల్‌గా వాదనలు జరుగుతున్న సమయంలో.. అకస్మాత్తుగా అశ్లీల వీడియో ప్లే అయ్యింది. చీఫ్ జస్టిస్ కోర్టురూమ్‌లోనే ఈ ఘటన చోటుచేసుకున్నది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వింటున్న సమయంలో ఈ ఘటన జరిగింది. పలుమార్లు వీడియో కాన్ఫరెన్స్ మధ్యలో పోర్న్ వీడియో ప్లే అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పట్ల కోర్టు న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వర్చువల్ కోర్టు వాదనలను నిలిపివేశారు.వర్చువల్ హియరింగ్ జరుగుతున్న సమయంలో రెండు సార్లు ఈ సమస్య ఎదురైనట్లు తెలిసింది. రెండు సార్లు అభ్యంతరకర పోర్న్ కాంటెంట్ ప్లే అయినట్లు చెప్పారు. అయితే వర్చువల్ ప్రోసీడింగ్స్‌ను కొనసాగించేందుకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను షట్‌డౌన్ చేసి మళ్లీ స్టార్ట్ ఛేశారు.తొలిసారి సమస్య రాగానే సిస్టమ్‌ను రీస్టార్ట్ చేశారు. కాసేపు బాగానే వీడియో కాన్ఫరెన్స్ వాదనలు జరిగాయి. అయితే మళ్లీ పోర్న్ ప్లే కావడంతో వీసీ సిస్టమ్‌ను పూర్తిగా షట్‌డౌన్ చేశారు. పోర్న్ వీడియో ప్లే అవుతున్న సమయంలో మీ సిస్టమ్ హ్యాక్ అయినట్లు మెసేజ్ కూడా వచ్చింది. అయితే హ్యాక్ అయిన విషయాన్ని ఆటోమెటిక్ వాయిస్ ద్వారా కూడా వినిపించినట్లు చెబుతున్నారు. దీంతో ఢిల్లీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్‌లో సైబర్ అటాక్ జరిగినట్లు పుకార్లు వ్యాపించాయి. నిందిత వ్యక్తి వీసీ స్క్రీన్‌ను షేర్ చేసుకుని, పోర్న్ వీడియోలు ప్లే చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. శ్రీధర్ సర్నాబాత్, షిట్‌జీత్ సింగ్ అకౌంట్ల నుంచి ఆ వీడియోలు ప్లే అయినట్లు అనుమానిస్తున్నారు.

# అమెరికా సర్కారు సంచలన నిర్ణయం.. ట్రంప్ ఫొటోతో పాస్‌పోర్టులు




**న్యూఢిల్లీ: ఏప్రిల్ 29(మహ ప్రభ)**
అమెరికా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోతో ఉన్న పాస్‌పోర్టుల ను త్వరలో విడుదల చేయాలని నిర్ణయించింది. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా పరిమిత సంఖ్యలో వీటిని రూపొందించనున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయి. తాజాగా అమెరికా విదేశాంగశాఖ ఈ విషయాన్ని ధ్రువీకరించింది.కాగా జూలైలో అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు జరగనున్నాయి. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా రూపొందించిన యూఎస్ పాస్‌పోర్టులు విడుదల చేసేందుకు విదేశాంగ శాఖ సన్నద్ధమవుతున్నది. అయితే ఈ పాస్‌పోర్టులు పరిమిత సంఖ్యలో ఉండనున్నాయని విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగాట్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ పాస్‌పోర్టులకు ఎలాంటి అదనపు రుసుము ఉండదని విదేశాంగ వర్గాలు వెల్లడించాయి. పాస్‌పోర్టులు విడుదల చేయనున్న విషయాన్ని వైట్‌హౌస్ కూడా ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. అందుకు సంబంధించిన ఫొటోలను కూడా పంచుకుంది. అందులో స్వాతంత్ర్య ప్రకటన పత్రంపై ట్రంప్ ఫొటో ఉండగా.. దాని కింద బంగారు రంగులో ఆయన సంతకం ఉంది. మరొక దానిలో యూఎస్ వ్యవస్థాపక పితామహుల చారిత్రాత్మక ఫొటో ఉంది. ప్రస్తుతం ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అధికారంలో ఉన్న నాయకుల ఫొటోలతో పాస్‌పోర్టులు రూపొందించడం చాలా అరుదు. అనేక దేశాలు చారిత్రక దృశ్యాలు, ప్రకృతి చిత్రాలను ముద్రించేందుకు ప్రాధాన్యం ఇస్తాయి. ప్రస్తుతం యూఎస్ పాస్‌పోర్టులపై చరిత్రలోని ముఖ్య ఘట్టాలు, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వంటి చారిత్రక ప్రదేశాలు ముద్రించి ఉన్నాయి.ఈ క్రమంలో ఇప్పుడు ట్రంప్ ఫొటోతో పరిమిత సంఖ్యలో పాస్‌పోర్టులను రూపొందించాలని అమెరికా నిర్ణయించింది. కాగా 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా ట్రంప్ ముఖచిత్రంతో స్మారక నాణెం రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ట్రంప్ సంతకం ఉన్న కరెన్సీ నోట్లను విడుదల చేయనున్నట్లు ట్రెజరీశాఖ ప్రకటించింది. దాంతో అమెరికా కరెన్సీ నోట్లపై సంతకం చేయబోయే తొలి అధ్యక్షుడిగా ట్రంప్ చరిత్ర సృష్టించనున్నారు.

# కేపీహెచ్‌బీ ఫేజ్-9లో "ది కేక్ సెంట్రల్ కేక్ ఫ్యాక్టరీ" ఘన ప్రారంభం

## -ఎంపీ ఈటెల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం





**కూకట్పల్లి, ఏప్రిల్ 29(మహ ప్రభ)**
కేపీహెచ్‌బీ ఫేజ్-9, సాయినాథ్ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా ప్రారంభమైన "ది కేక్ సెంట్రల్ కేక్ ఫ్యాక్టరీ" ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ హాజరై రిబ్బన్ కట్ చేసి ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని సంస్థ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.
ప్రాంత ప్రజలకు నాణ్యమైన కేక్స్, షేక్స్, ఐస్‌క్రీమ్స్‌తో పాటు వివిధ వేడుకలకు అవసరమైన సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం ఆనందదాయకమని నాయకులు పేర్కొన్నారు. కొత్త వ్యాపార సంస్థ విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతమ్ రెడ్డి, సెంట్రల్ ఫిలిం బోర్డు సభ్యురాలు దేశభత్తుల సుధా, కేపీహెచ్‌బీ, వసంత నగర్ మరియు బాలాజీ నగర్ డివిజన్ బీజేపీ నాయకులు గురు ప్రసాద్, వినోద్, తోట రమేష్ పవన్, శ్రీ లక్ష్మి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


# బెంగాల్‌లో మూడింట రెండొంతుల స్థానాలు సాధిస్తాం..

## -సీఎం మమతాబెనర్జి ధీమా



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 29(మహ ప్రభ)**
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు తమదేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతాబెనర్జి ధీమా వ్యక్తంచేశారు. విజయం మామూలుగా ఉండబోదని మొత్తం స్థానాల్లో మూడింట రెండొంతుల స్థానాలను తమ పార్టీ గెలుస్తుందని కాన్ఫిడెంట్‌గా చెప్పారు. ఇవాళ మమతా బెనర్జీ కోల్‌కతాలో తన ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.ఓటు వేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అద్భుత విజయం సాధిస్తుందని చెప్పారు. మూడింట రెండొంతుల మెజారిటీ తమ పార్టీ సాధిస్తుందని అన్నారు. బీజేపీకి ఘోరం పరాజయం తప్పదని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె తన అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు విజయ చిహ్నం చూపిస్తూ వారిని ఉత్సాహపరిచారు. అదేవిధంగా కేంద్ర బలగాలు, పరిశీలకులపై మమతాబెనర్జి ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది, కేంద్ర పరిశీలకులు మహిళలు సహా అందరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారని, అమాయకులను కొడుతున్నారని మండిపడ్డారు. మహిళలు, పిల్లలను కూడా వదలడం లేదని ఆరోపించారు. నిన్న రాత్రి నుంచి ఘోరాలకు పాల్పడ్డారని అన్నారు. ఎంతోమంది టీఎంసీ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

# గురుగ్రామ్ స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్




**న్యూఢిల్లీ: ఏప్రిల్ 29(మహ ప్రభ)**
గురుగ్రామ్‌లో అనేక స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. బెదిరింపు మెయిల్స్ రాగానే స్కూళ్లలోనే తక్షణమే ఎమర్జెన్సీ ప్రోటోకాల్ పాటించారు. అనేక స్కూళ్లు హాలీడే ప్రకటించాయి. పేరెంట్స్‌కు మెసేజ్ చేశాయి. పిల్లలను తీసుకెళ్లాలని ఆ మెసేజ్‌లో కోరాయి. స్కూళ్ల వద్ద భారీ సంఖ్యలో పేరెంట్స్ చేరుకున్నారు. బాంబు బెదిరింపులు వచ్చిన స్కూళ్ల వద్దకు బాంబు డిస్పోజ్ స్క్వాడ్‌లు చేరుకుని తనిఖీ చేస్తున్నాయి. శ్రీ రామ్, ఆమిటీ, హెచ్‌డీఎఫ్ స్కూళ్లలకు ఇవాళ ఉదయం 8.33 నిమిషాలకు ఈమెయిల్స్ వచ్చాయి. అయితే ఆ సమయానికి విద్యార్థులు స్కూళ్లకు రావడం ప్రారంభమైంది. బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు సుమారు 10 స్కూళ్లు ఇవాళ పోలీసులను ఆశ్రయించాయి. అన్ని స్కూళ్లలోనూ పోలీసులు సెర్చ్ చేస్తున్నట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి చెప్పారు.


# ప్రాణాలైనా అర్పిద్దాం.. శత్రువుకు మాత్రం తలవంచొద్దు..

## -ఇరాన్ ఎంబసీ పోస్టు వైరల్



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 29(మహ ప్రభ)**
అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో యూకే లోని ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన ఓ పోస్ట్ వైరల్‌గా మారింది.
అమెరికా-ఇజ్రాయెల్ తో జరుగుతున్న యుద్ధంలో శత్రువుకు తల వంచొద్దని, దేశాన్ని వారికి అప్పగించే బదులు మనమంతా ప్రాణాలు అర్పిద్దామని యూకేలో నివసిస్తున్న ఇరాన్ పౌరులకు దౌత్యకార్యాలయం పిలుపునిచ్చింది. బలిదానానికి సిద్ధంగా ఉన్నవారు తమను సంప్రదించాలని కోరింది. ఈ ఎంబసీ పోస్టును నెటిజన్‌లు తీవ్రంగా ఖండించారు.ఇరాన్ దౌత్య కార్యాలయం పోస్ట్ ప్రజలను రెచ్చగొట్టేలా ఉందంటూ యూకే అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి పోస్ట్ చేసినందుకు ఆ దేశ రాయబారి సయ్యద్ అలీ మౌసావినికి సమన్లు జారీచేశారు. అయితే ఇరాన్ రాయబార కార్యాలయం తమ పోస్ట్‌ను సమర్థించుకుంది. ఈ ప్రచారం దేశభక్తికి, దేశంపై విధేయతకు సంబంధించినదని, హింసను ప్రోత్సహిస్తున్నట్లు కాదని పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు ఎల్లప్పుడూ తమ మాతృభూమి పరిరక్షణకు ముందుంటారని తెలిపింది. కాగా యుద్ధంలో ప్రాణత్యాగం చేయడానికి తనతో సహా ఇరాన్ పౌరులు సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సైతం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంబసీ పోస్ట్ ఆందోళన రేపుతున్నది.

# మేము లేకపోతే అమెరికన్లు ఫ్రెంచ్ మాట్లాడేవారేమో !



**వాషింగ్టన్ ఏప్రిల్ 29(మహ ప్రభ)**
సాధారణంగా వివిధ దేశాధినేతలను వైట్ హౌస్‌కు పిలిచి వారిపై నోటి దురుసు ప్రదర్శించే అలవాటు అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్‌నకు ఉంటుంది. అయితే ఈసారి సీన్ రివర్స్ అయింది. వైట్ హౌస్‌లో ట్రంప్ తీరుపై బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్-3 తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బ్రిటన్ జోక్యం లేకపోయి ఉంటే, అమెరికన్లు ఇప్పటికీ ఫ్రెంచ్ మాట్లాడేవారేమో అని ఆయన వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం వైట్‌హౌస్‌లో జరిగిన విందులో కింగ్ చార్లెస్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీరు ఇటీవల అమెరికా లేకపోతే యూరప్ దేశాలు జర్మన్ మాట్లాడేవి అన్నారుగా. అదే విధంగా, మేము లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడేవారేమో' అని చార్లెస్ అన్నారు. దీంతో అక్కడున్నవారంతా గట్టిగా నవ్వారు. 250 ఏళ్ల క్రితం అమెరికాకు స్వాతంత్ర్యం రాకముందు, ఈ దేశంపై పట్టు కోసం బ్రిటన్, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నం గురించి ఆయన ప్రస్తావించారు. చార్లెస్ ఇంతటితో ఆగలేదు. రియల్ ఎస్టేట్ దిగ్గజమైన ట్రంప్‌ను ఉద్దేశించి 1814లో బ్రిటన్ సైన్యం వైట్ హౌస్‌ను తగులబెట్టిన ఘటనను రియల్ ఎస్టేట్ రీ-డెవలప్ మెంట్ అంటూ అభివర్ణించారు. కాగా అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, రెండు దేశాల సంబంధాలు అభివద్ధి చెందిన తీరు పట్ల కింగ్ చార్లెస్ కతజ్ఞతలు తెలిపారు.

# టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

మొదటి తరువాయి

సాంఘిక సంక్షేమ గురుకులాలు 99.10శాతం ఉత్తీర్ణతతో అగ్రగామి గా నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 86.18 శాతం నమోదు కాగా ప్రయివేటు పాఠశాలల్లో 95.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,731 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా, ఆరు ప్రయివేటు పాఠశాలల్లో 0 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 99.30 శాతంతో ము లుగు జిల్లా మొదటి స్థానంలో నిలువ గా, అత్యల్పంగా 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల సంచాలకు లు పి.వి.శ్రీహరి, ఎస్సీఈఆర్టీ సంచాలకులు రమేశ్‌తో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు బుధవారం పదో తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 5,26,166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 4,97,312 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో తెలుగు మీడియంలో 89.14 శాతం, ఇంగ్లీష్ మీడియంలో 95.86 శాతం, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**రీ కౌంటింగ్, వెరిఫికేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ**

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు నేటి నుంచి మే 14 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్కుల రీ కౌంటింగ్‌కు రూ. 500, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. కాగా జూన్ 5 నుంచి 12 వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిం చనున్నారు. కాగా మే14వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. అయితే ఆయా సబ్జెక్ట్ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు రూ.50 ఆలస్య రుసుముతో ఫీజును చెల్లించేందుకు అవకాశం ఉంది.

# హెడ్, క్లాసెన్ మ్యాజిక్..

మొదటి తరువాయి

244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి.. ఈ ఫీట్ సాధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ హాఫ్ సెంచరీలతో జట్టును గెలిపించారు. ఇక ఈ టోర్నీలో ఆరో ఓటమిని నమోదు చేసిన ముంబై ఇండియన్స్.. ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ భారీ స్కోరు చేసింది. ర్యాన్ రికల్టన్ అజేయ సెంచరీ (55 బంతుల్లో 123 రన్స్ నాటౌట్)తో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 243/5 పరుగులు చేసింది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన సన్ రైజర్స్ హైదరాబాద్.. ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని.. ట్రావిస్ హెడ్ ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. 30 బంతుల్లోనే ఏకంగా 8 సిక్సర్లు, 4 ఫోర్లతో 76 పరుగులు స్కోరు చేశాడు. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 45 రన్స్‌తో బ్యాట్ ఝుళిపించడంతో సన్ రైజర్స్.. లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. పవర్ ప్లే ముగిసే సరికి 92/0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది.ఓపెనర్లు ఇద్దరూ ఔట్ అయిన తర్వాత జట్టును గెలిపించే బాధ్యతను హెన్రిచ్ క్లాసెన్ తీసుకున్నాడు. ఓ దశలో తొలి వికెట్‌కు 129 పరుగుల భాగస్వామ్యం వచ్చిన తర్వాత.. సన్ రైజర్స్ స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయింది. కేవలం ఏడు బంతుల వ్యవధిలో ఓపెనర్లతో పాటు ఇషాన్ కిషన్ వికెట్‌ను సైతం కోల్పోయింది. ఈ సమయంలో ముంబై.. ఒత్తిడి పెంచాలని భావించింది. కానీ హెన్రిచ్ క్లాసెన్.. ముంబైకి, సన్ రైజర్స్‌కు మధ్య అడ్డుగోడలా నిలబడ్డాడు. సాధించాల్సిన రన్ రేట్‌కు తగ్గట్లుగా బ్యాటింగ్ చేస్తూ.. జట్టును విజయతీరాలకు చేర్చాడు.క్లాసెన్ 30 బంతుల్లో 65 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. సలీల్ అరోరా సైతం 10 బంతుల్లో 30 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో 18.4 ఓవర్లలో సన్ రైజర్స్.. 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 244 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసింది. ఈ విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ పాయింట్స్ టేబుల్‌లో మూడో ప్లేసుకు చేరింది. ముంబై ఆరో ఓటమితో 9వ ప్లేసులో కొనసాగుతోంది.

# ఎన్‌డీయే కూటమి హ్యాట్రిక్..

**అసోంలో మళ్లీ విజయం అధికార ఎన్‌డీయేదే**



న్యూఢిల్లీ

అసోంకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. అనేక సంస్థల అంచనా ప్రకారం అసోంలో బీజేపీ ఆధ్వర్యంలోని అధికార ఎన్‌డీయే కూటమిదే మళ్లీ విజయం. అసోంలో ఇప్పటివరకు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయేనే అధికారంలో ఉంది. హిమంత బిశ్వ శర్మ సీఎంగా కొనసాగుతున్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఆయన ఆధ్వర్యంలోనే ఎన్‌డీయే విజయం సాధించబోతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చెబుతున్నాయి.అసోంలో 126 అసెంబ్లీ సీట్లు ఉండగా, 64 సీట్లు సాధిస్తే అధికారం సాధ్యం. తాజా అంచనాలివి. మ్యాట్రిక్స్ అంచనా ప్రకారం బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయేకు 88--98 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 22--32 సీట్లు, ఇతరులకు 3--5 సీట్లు, చాణక్య స్ట్రాటజీస్ అంచనా ప్రకారం ఎన్‌డీయేకు 85--95 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 25--32 సీట్లు, ఇతరులకు 6--12 సీట్లు, పోల్ డైరీ అంచనా ప్రకారం ఎన్‌డీయేకు 88--101 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 15--26 సీట్లు, ఇతరులకు 3--7 సీట్లు, యాక్సిస్ మై ఇండియా సంస్థ అంచనా ప్రకారం ఎన్‌డీయేకు 88--100 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 24--36 సీట్లు వచ్చే అవకాశాలున్నాయి. అన్నింట్లోనూ బీజేపీ కూటమి ఘన విజయం ఖాయంగా కనిపిస్తోంది. వరుసగా రెండు సార్లు విజయం సాధించిన ఎన్‌డీయే కూటమి అసోంలో మరోసారి అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టడం ఖాయమనేది అంచనా.

# ప్రజాదరణ కోల్పోతున్న ట్రంప్

మొదటి తరువాయి

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దళాలు యుద్ధం ప్రారంభించిన తర్వాత గ్యాసోలిన్ ధరలు ఏకంగా 40 శాతం పెరిగి గ్యాలన్‌కు 4.18డాలర్లకు చేరాయి. ధరల పెరుగుదల అమెరికా కుటుంబాలపై పెను భారం మోపింది. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలలో అమెరికా ప్రతినిధి సభపై పట్టు కోల్పోతామేమోనని రిపబ్లికన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిపబ్లికన్లలో మాత్రం ఇప్పటికే ట్రంప్‌ను 78 శాతం మంది వెనకేసుకొస్తున్నారు. అయితే జీవనవ్యయాన్ని అదుపు చేయడంలో ట్రంప్ విఫలమయ్యారని 41 శాతం మంది రిపబ్లికన్లు అభిప్రాయపడడం గమనార్హం. మధ్యంతర ఎన్నికలలో నిర్ణయాత్మక పాత్ర పోషించే స్వతంత్ర ఓటర్లు ఇప్పుడు డెమొక్రాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో 20 శాతం మంది తటస్థులు డెమొక్రాట్లను సమర్థిస్తే తాజాగా అది 34 శాతానికి పెరిగింది. ప్రతి నలుగురు స్వతంత్ర ఓటర్లలో ఒకరు ఇప్పటికీ ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. ధరలను అదుపులోకి తెస్తానన్న హామీతో 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఇప్పుడు ట్రంప్‌ను సమర్థిస్తున్న వారి సంఖ్య కేవలం 27 శాతం మాత్రమే. 2017-2021 మధ్య ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించినప్పుడు ఆయన రేటింగ్ ఇంత దారుణంగా పడిపోయిన సందర్భం లేదు. అత్యంత బలహీనమైన బైడెన్ ఆర్థిక రేటింగ్ కంటే ఇది తక్కువగా ఉంది.

## పశ్చిమబెంగాల్‌లో

# పోటెత్తిన ఓటర్లు

మొదటి తరువాయి

టీఎంసీ ఎంపీలు మహువా మొయిత్రా, అభిషేక్ బెనర్జీ, బీజేపీ నేత, నటుడు మిథున్ చక్రవర్తి, మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ సహా పలువురు ప్రముఖులు ఓటేశారు. రెండోవిడతలో పోటీ పడుతున్న కీలక అభ్యర్థుల్లో సీఎం మమతాబెనర్జీ, ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఉన్నారు. భవానీపూర్ నియోజకవర్గంలో మమతపై సువేందు అధికారిని బీజేపీ పోటీకి నిలిపింది. భాత్ పాడా, రాణాఘాట్, కోల్‌కతా ఉత్తర్, కోల్‌కతా దక్షిణ్, రాశ్ బెహారీ, జాధవ్ పుర్, బాలీగంజ్‌లు రెండో దశలో కీలకంగా ఉన్నాయి.

# 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడి హట్టి

మొదటి తరువాయి

గతంలో జరిగిన చర్చల ప్రకారం 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు మహారాష్ట్ర అంగీకరించిందనీ, 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందనీ, మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చుతో నీటిని తీసుకునే వీలుందని ఈ సందర్భంగా ఇంజినీరింగ్ నిపుణులు సీఎంకు తెలిపారు. బ్యారేజ్ నిర్మాణంతో ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలోని మెట్ట ప్రాంతాల రైతులకు సాగు, తాగు నీరందుతుందన్నారు. అలాగే తక్కువ ఖర్చుతో గ్రావిటీపై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించే వీలుంటుందని సీఎం చెప్పారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా మహారాష్ట్రతో వెంటనే సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదనీ, ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వెంటనే లేఖ రాయాలని సూచించారు.



గురువారం కేంద్ర మంత్రి సమయం తీసుకుని నేరుగా కలిసి చర్చించే బాధ్యతను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అప్పగించారు, తుమ్మిడిహెట్టి బ్యారేజ్ అవసరం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కిషన్‌రెడ్డికి తెలంగాణ రైతుల పక్షాన విజ్ఞప్తి చేయాలన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వర్షాకాలంలోపు వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం ఆదేశించారు.

నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

తుమ్మిడిహట్టి బ్యారేజ్ ఎంత ఎత్తున నిర్మించాలి.. ఎంత ఎత్తు నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుంటుందని ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ మీద ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిందనీ, కొన్ని చోట్ల కాల్వల నిర్మాణం కూడా జరిగిందని అన్నారు. 71.5 కిలోమీటర్ల కెనాల్ పనులు జరిగాయని అధికారులు తెలిపారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందనీ, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని తెలిపారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలన్నింటినీ సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, ఈఎన్సీ శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అధికారం రావడం..పోవడం రొటీన్ వ్యవహారం

మొదటి తరువాయి

తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు. కానీ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్లు జనాలను మోసం చేశారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోతుందని కేసీఆర్ చెప్పారు. కానీ మనం వినలేదు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించాం. మన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతాడని క్లియర్‌గా చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలా మంది జనాలు భావించారని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.

# తండ్రికి విలువ ఇవ్వని కవిత...అమ్మ ఎలా అవుతుంది

మొదటి తరువాయి

అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైందన్నారు. మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు, రాజకీయ చర్యలపై స్పందిస్తూ ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ ఏర్పాటు విషయాన్ని రాజగోపాల్ రెడ్డి 'బిగ్ జోక్'గా అభివర్ణించారు. అదే విధంగా టిఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టడం మరో జోక్ అని వ్యాఖ్యానించారు. కవితకు ఉన్న గుర్తింపు కేవలం ఒక ఉద్యమకారుడు బిడ్డగా మాత్రమేనని, ఆమె స్వతంత్ర రాజకీయ నాయకత్వం ఇంకా నిరూపించుకోలేదని అన్నారు. మొదటి సమావేశంలోనే తన తండ్రి అయిన కేసీఆర్‌ను విమర్శించడం సరైంది కాదని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తండ్రిపై గౌరవం, ప్రేమ ఉండాలని, అలాంటి విలువలు లేకపోతే ఆమె వ్యక్తిత్వం ప్రశ్నార్థకమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందిఅంటూ ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కవిత అన్నపై ఉన్న కోపాన్ని తండ్రిపై చూపడం సరికాదని అన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయ వేదికపైకి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఆయన సూచించారు. కవితపై ఉన్న మద్యం కుంభకోణం ఆరోపణల విషయమై.. ఆమెకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, నిర్దోషి అని తేలలేదని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం డబ్బులు ఉన్నాయనే కారణంతో పార్టీ పెట్టడం అంత సులువు కాదని, అది పాన్ షాప్ పెట్టినంత ఈజీ కాదని వ్యాఖ్యానించారు. తనంతట తాను పోటీ చేసినా కవితకు డిపాజిట్ కూడా రాదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఇక తన రాజకీయ భవిష్యత్తుపై మాట్లాడుతూ, అధిష్ఠానం తనకు పెద్ద పదవి ఇస్తే ఆ బాధ్యతను న్యాయంగా నిర్వహిస్తానని తెలిపారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు

మొదటి తరువాయి

ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు నడుస్తున్నాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 6,500 లారీలను సిద్ధం చేశారు. ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతులకు ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. 3.46 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం ద్వారా 64,779 మంది రైతులకు లబ్ది చేకూరింది. అలాగే, 30,220 మెట్రిక్ టన్నుల సెనగ కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించేందుకు నిరుటి కంటే ఈసారి కేంద్రాల సంఖ్యను పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయింది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో దొడ్డు, సన్న రకాలుగా విభజించి సేకరణ కొనసాగుతోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. అదనంగా, సుమారు 20 కోట్ల గన్నీ సంచులు ముందుగానే నిల్వ ఉంచారు, తద్వారా కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.2031 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా.. ఇప్పటికే దాదాపు రూ.323 కోట్లు రైతులకు చెల్లించారు. వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ధాన్యంతో పాటు రాష్ట్రంలో ఇతర పంటల కొనుగోళ్లు కూడా కొనసాగు తున్నాయి. ఈసారి 43.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాలున్నాయి. ఇప్పటివరకు 3.46 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయి. దాదాపు రూ.830.69 కోట్ల విలువైన కొనుగోళ్లతో 64,779 మంది రైతులు లబ్ది పొందారు. 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సెనగ పంట దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 30,220 మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగింది. దీనివల్ల 15,933 మంది రైతులు లబ్ది పొందారు. పొద్దుతిరుగుడు పంటకు 19,808 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 3,492 మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయింది. 2,512 మంది రైతుల నుంచి కొనుగోళ్లు జరిగాయి. అన్ని జిల్లాల్లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా కొనసాగుతున్నాయి. రైతులకు కనీస మద్దతు ధర అందించటంతో పాటు సౌకర్యవంతమైన సేవలు, తక్షణ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

# ఇకపై మంచిగా ఉండను.. మరింత దూకుడుగా వెళ్తా..

**ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**



న్యూఢిల్లీ

అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోకుండా ఆలస్యం చేస్తున్న ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై తాను మంచిగా ఉండబోనంటూ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా తన ప్రత్యేక ఫొటోను పంచుకున్నారు. దానిపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అంటే, ఇకపై తాను మంచివాడికి కాను అంటూ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అణు నిరాయుధీకరణ ఒప్పందంపై ఇరాన్ నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని, అమెరికా మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ఈ విషయంలో తెలివిగా వ్యవహరించాలన్నారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని, అణు ఒప్పందం విషయంలో ఎలా వ్యవహరించాలో వారికి తెలియడం లేదని ట్రంప్ అన్నారు. అణు ఒప్పందం విషయంలో ఇరాన్‌కు కొత్త ప్రతిపాదనలు చేసినట్లు ట్రంప్ వెల్లడించారు. వాటిని అంగీకరించాలని సూచించారు. ఇరాన్--అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ చర్చలు మాత్రం కొనసాగడం లేదు. అణు ఒప్పందం అంశంలో ప్రతిష్టంభన నెలకొంది. మరోవైపు హోర్ముజ్‌ను అమెరికా దిగ్బంధించింది. ఈ జలసంధి నుంచి నౌకల రవాణాను ఇరాన్ కూడా అడ్డుకుంటోంది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు జరిగి, హోర్ముజ్ జలసంధి తెరుచుకోవాలని ప్రపంచ దేశాలు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు తాజా పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ మద్దతు కోరేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. సెయింట్ పీటర్స్ బర్గ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమైనట్లు తెలుస్తోంది.

# అమరావతిలో ఫైనాన్స్ సిటీ

మొదటి తరువాయి

సమాచారం ప్రకారం నూతనంగా నిర్మిస్తున్న రాజధాని నగరానికి ఆదాయార్జనే లక్ష్యంగా ఫైనాన్స్ సిటీ నిర్మాణం ఉండనుంది. దీనిలో భాగంగా 1690 ఎకరాల్లో హైరైజ్ భవనాలు నిర్మించి, వాటిలో వివిధ కార్పొరేట్ సంస్థల కార్యాలయాలు ఏర్పాటు అయ్యేలా చూడటం, వాటి కార్యకలాపాల ద్వారా నగరానికి ఆదాయాన్ని సంపాదించడం ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్నారు. హైరైజ్ భవనాలను ఐదు రకాలుగా నిర్మించాలని, వాటిని నేరుగా విక్రయించడం, లీజుకివ్వడం ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవచ్చని భావిస్తున్నారు. అలాగే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం ద్వారా ఇక్కడ భూమి విలువ కూడా మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే, ఎంత పెట్టుబడి పెట్టాలి. గతంలో మాదిరిగా ఒప్పందం చేసుకోవాలా, లేక సిఆర్డిఏ ఆధ్వర్యాన నిర్మించి ఇవ్వడం ద్వారా ఆదాయం రాబట్టుకోవాలా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ నిర్మాణం కోసం సింగపూర్ కు చెందిన సుర్బానా జురాంగ్ కన్సార్టియానికి 1694 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. 2019లో ప్రభుత్వం మారడంతో స్విస్ ఛాలెంజ్ ఒప్పందాన్ని అప్పటి ప్రభుత్వం రద్దు చేసుకోవడంతోపాటు ఒప్పందంలో అవినీతి ఉందనే పేరుతో పోలీసులు సింగపూర్ వెళ్లి విచారణ జరిపారు. దీన్ని అవమానంగా భావించిన సింగపూర్ ప్రతినిధులు ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. 2024లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం సింగపూర్ ప్రతినిధులతో ఆ ప్రాజెక్టును పునరుద్దరించేందుకు పలు దఫాలు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో దాని స్థానంలో ఫైనాన్స్ సిటీని నిర్మించాలని నిర్ణయించారు.

## గాంధారి మండల ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 90% ఉత్తీర్ణత

ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ప్రభంజనం



**గాంధారి, ఏప్రిల్ 29 (మహా ప్రభ)**
స్థానిక ఉన్నత పాఠశాల గాంధారి మండలం లో దాదాపుగా 15 చుట్టుపక్కల గ్రామాలు హాబిటేషన్ ల ద్వారా తాండ ల ద్వారా విభిన్నమైన ప్రాంతాల, విభిన్న పరుస్థితుల విద్యార్థులు ఇంకా బడి మధ్యలో మానేసిన విద్యార్థులను ఆగష్టు, సెప్టెంబర్ వరకు నేనున్నాను. అంటూ అక్కున చేర్చుకొని ప్రతిభ పాటలను నేర్పుతు ఉత్తమ ఫలితాలను సాధించిడం స్ఫూర్తిదాయకం. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, వారి తల్లిదండ్రుల నుండి ఎలాంటి ఆర్థిక పెట్టుబడి లేకుండా... ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలను, ఆహారం మధ్యాహ్న భోజనం, రాగిజావా అందిస్తూ హైదరాబాద్ లాంటి నగరంలోని కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా పేద, మధ్య తరగతి విద్యార్థులను కూడా ఉన్నత స్థాయిలో ఉంచేలా.. ఉత్తమ ఉపాధ్యాయులతో ఉన్నతమైన విద్యనందిస్తున్న ప్రథమ స్థాయిగా సింధుజ 552/600, స్ఫూర్తి 532/600, స్నేహ 530/600 మండలానికి టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, మల్లేశం, రాజు, చిరంజీవి, ఇతరులు ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివేలా తల్లిదండ్రులు సహకరించాలని పేర్కొన్నారు.

## వడ్డేరులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

-దేవరకొండ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ



**దేవరకొండ( డివిజన్) ఏప్రిల్ 29( మహాప్రభ )**
వడ్డెరలను ఏ ప్రభుత్వము ఎప్పుడు ఆదుకోలేదని గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం వాగ్దానం చేసి నెరవేర్చలేదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి వడ్డెరలను పట్టించుకోవడంలేదని దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చెప్పేది ఒకటి ఎన్నికలు అయిపోయాక చేసేది ఒకటి టిఆర్ఎస్ ప్రభుత్వంలో వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేరుస్తామని అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ అప్పటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ సభలలో వడ్డెర కులాన్ని మేము అధికారంలోకి వస్తే ఎస్టీ జాబితాలో చేరుస్తామని నేటి వరకు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు కూడా మా వడ్డెర కులాన్ని గురించి పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ మంత్రులను ఎమ్మెల్యేలను తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల వినతి పత్రాలు అందజేశాం వినతిపత్రంలో వడ్డెర కులాన్ని ఇచ్చిన మాట ప్రకారం ఎస్టిలో చేర్చాలని వడ్డెర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కార్పొరేషన్కు సరిపోను నిధులు కేటాయించాలని పెద్దపెద్ద ప్రాజెక్టుల్లో పనులు చేస్తూ ఉన్న వడ్డెర కులానికి సంబంధించిన వ్యక్తులు చాలామంది బ్లాస్టింగ్ లో పెద్ద పెద్ద బండ రాళ్లు కొడుతూ ప్రమాదంలో చనిపోయారని ఆయన అన్నారు ఆయన అన్నారు చనిపోయిన బాధితులకుఎక్స్గ్రేషియా చెల్లించడం లేదని ఆయన తెలిపారు వడ్డెర కులానికి సంబంధించిన పిల్లలకు ఎస్సీ ఎస్టీ వాళ్లకు ప్రత్యేక గురుకులాలు ఉన్నట్టు మా కులానికి కూడా ప్రత్యేక గురుక?

### మాజీ పిఎసిఎస్ చైర్మన్ సాయి కుమార్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్,



**గాంధారి, ఏప్రిల్ 29 (మహా ప్రభ)**
మాజీ పి ఎ సి ఎస్ చైర్మన్ సాయి కుమార్, కుమార్తె వివాహ వేడుక గాంధారి మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాంధారి మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, యువ నాయకులు మరియు వివిధ హోదాలలో ఉన్న నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులకు మరియు ఆర్టీసీ అసిస్టెంట్ డిఎం సైదులకు ఘన సన్మానం



**దేవరకొండ ఏప్రిల్ 29( మహాప్రభ)**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైనటువంటి దేవరకొండ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ను ఘనంగా సన్మానించారు. కో ఆప్షన్ సభ్యులు గార్లపాటి దామోదర్, మైనదిన్, ఏ కుల సిఫోరమ్మ, నేతల భాగ్యలక్ష్మి శ్రీనివాస్ యాదవ్. ఆర్టీసీ సీఐ సైదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మెమొంటో అందించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి మీ వంతుగా మీరు సేవలందిస్తూ సమాజానికి, సమాజ శ్రేయస్సు కు తోడుపడుతూ ప్రజల్లో మమేకమై ప్రజల కోసం పోరాటం చేస్తూ ప్రభుత్వానికి,ప్రజలకు న్యాయం చేసే దిశలో ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు,పున్నా వెంకటేష్ నేత భీమగోని శివ గౌడ్,ఎండి రంజాన్ బేగ్, లైబ్రరీ శారద తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతమైన విద్యానందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి.

-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.



**మెదక్ జిల్లా -29ఏప్రిల్ (మహాప్రభ )**
రామాయంపేట రెసిడెన్షియల్ కళాశాల భవన నిర్మాణానికి రూ. 4.13కోట్ల. లక్షల రూ.మంజూరు పట్ల ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించేందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. రామా యంపేట రెసిడెన్షియల్ కళాశాల భవన నిర్మాణం కు గాను నాలుగు కోట్ల 13 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రోహిత్ పేర్కొన్నారు. తాను ముఖ్యంగా పేద ప్రజల విద్యార్థులకు నాణ్యమైన విద్య వైద్యం అందిస్తానని ఎన్నో మార్లు చెప్పినట్లు ఆయన తెలిపారు. పేద విద్యార్థుల కు మంచి విద్యను అందించి వారు రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయికి చేరుకుంటే ఎంతో పేరు వస్తుందని ఆయన తెలిపారు. ఈ భవన నిర్మాణానికి విధుల మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవతో నిధుల మంజూరు చేసిన చేయించినట్లు ఆయన తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్ రావు కి విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## సికింద్లాపూర్‌లో బాల పంచాయతీ కార్యక్రమం

పిల్లల్లో నాయకత్వ లక్షణాల పెంపు




**శివంపేట, ఏప్రిల్ 29(మహాప్రభ):**
తెలంగాణ పోలీస్ శాఖలోని సిఐడి తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బాల పంచాయతీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, మెదక్ జిల్లాలోని సికింద్లాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఈరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, బాల్య వివాహాలను తగ్గించడం, అలాగే చైల్డ్ అబ్యూస్ వంటి సమస్యలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా యంగిస్తాన్ ఫౌండేషన్ వాలంటీర్లు గ్రామానికి వచ్చి సుమారు 15 మంది పిల్లలను ఎంపిక చేసి బాల పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ప్రత్యేక శిక్షణ కూడా అందించారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, తూప్రాన్ ఇన్స్పెక్టర్ రంగాకృష్ణ, శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి పాల్గొని పిల్లలకు మార్గనిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఎంపీడీవో, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఎంపీవో, స్కూల్ హెడ్మాస్టర్ మరియు ఇతర అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కనక దుర్గా అమ్మవారి భూమి పూజ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 29( మహాప్రభ )**
నియోజకవర్గంలోని చందంపేట మండల కేంద్రంలో శ్రీ కనక దుర్గా అమ్మవారి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండి, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. దైవచింతనతో మానసిక ప్రశాంతతతో పాటు అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జామున మాధవ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జర్పుల బధ్య నాయక్, గ్రామ సర్పంచ్ సాధిక్,మండల నాయకులు దొండేటి మల్లా రెడ్డి,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపడి నేతాళ్ళ పాపయ్య మృతి

--పరామర్శించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 29( మహాప్రభ )**
నియోజకవర్గంలోని నేరేడుగొమ్ముమండలంలోని కాచరాజుపల్లి గ్రామానికి చెందిన నేతాళ్ళ పాపయ్య పిడుగుపడి మరణించిన విషయం తెలుసుకొని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నేతాళ్ళ పాపయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి,బాధిత కుటుంబానికి పరామర్శించి, వారి కుటుంబానికి ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా ఆదుకుంటాం అని భరోసా కల్పించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారితో పాటు మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్, కాచరాజు పల్లి సర్పంచ్ బాబు రామ్ నాయక్, నాయకులు నారాయణ నాయక్, వెంకటయ్య,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన వధూ వరులను ఆశీర్వదించిన దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ .



**దేవరకొండ( డివిజన్) ఏప్రిల్ 29 ( మహాప్రభ )**
నియోజకవర్గంలోని నేరడ గొమ్మ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మెగావత్ తండ లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొనీ నూతన వధూవరులను ఆశీర్వదించిన నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల మాజీఅధ్యక్షుడు లోకసాని తిరుపతయ్య మాజీ సర్పంచ్ వెంకటేష్ బొల్లారం మాజీ సర్పంచ్ లాల్ సింగ్.నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు....

## వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు




**కూకట్పల్లి ,ఏప్రిల్ 29 (మహాప్రభ)**
కూకట్‌పల్లి చిత్తరమ్మ ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన చిన్నారి కావ్యశ్రీ నూతన వస్త్రాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించబడింది. మిత్రులు వెంకటరెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి కావ్యశ్రీకి నూతన వస్త్రాలు అలంకరించి సంప్రదాయబద్ధంగా ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు చిన్నారిని ఆశీర్వదిస్తూ, ఆమె భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు.

## సదాశివనగర్ మండలంలోని ఉత్తీర్ణత సాధించిన భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు.

100% ఉత్తీర్ణత సాధించారు.

**గాంధారి, ఏప్రిల్ 29 (మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు 100% ఉత్తీర్ణత సాధించి సదాశివ నగర్ మండలంలోని టాపర్ గా నిలిచిన భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు. జి రాజేశ్వరి536/600. టి శ్రీవర్ష.519/600 టీ ప్రశాంత్507/600 ఎం నితీష్506/600 యు సాయి వర్ధన్505/600 జి హర్షవర్ధన్491/600 వి అక్షయ్491/600 కే రాహుల్495/600 కే సందీప్477/600 జె హర్షిత471/600 జి రోహిత్468/600 కె కౌశిక్465/600 రామ్ చరణ్448/600 కె నరేష్ 441/600జి రంజిత్418/600- సదాశివ నగర్ మండలంలోని ఆంధ్రాయిడ్ శాతం ఉత్తీర్ణత సాధించిన భూంపల్లి జిల్లా పరిస్థితి హై స్కూల్ విద్యార్థులను అభినందించిన



సదాశివ నగర్ ఎంఈఓ యూసఫ్ మరియు భూంపల్లి గ్రామ ప్రజలు. బొంపల్లి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఇంత చక్కగా చదివి ఉత్తినేత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు మరియు వారి తల్లిదండ్రులకు అభినందించిన సదాశివ నగర్ యూసఫ్ ఉత్తర్నత సాధించిన మా పిల్లలకి ఇంత చక్కటి 100% మార్కులు సాధించేటట్టు కృషిచేసిన ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి భూంపల్లి గ్రామస్తులు, పెద్దలు, హర్షం వ్యక్తం చేశారు.

# కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణి

-ఇంటింటికీ సర్కారు పథకాలతో ఊరువాడ సంబురం...
-ఎమ్మెల్యే - నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 29( మహాప్రభ )**
దేవరకొండపట్టణంలోని ఎమ్మెల్యే నివాసం మార్కెట్ యార్డులో కళ్యాణ లక్ష్మీ మరియు షాది ముబారక్ ప్రభుత్వం నుండి మంజూరైన 94 మంది లబ్ధిదారులకు గాను 94 లక్షల పదివేల తొమ్మిది వందల నాలుగు రూపాయల విలువగల చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేసిన శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ఆర్థిక భారం తగ్గించేందుకు కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.
చింతపల్లి 25చెక్కులకు గాను 2,502,900 రూపాయలు.
చందంపేట 29చెక్కులను గాను 2,903,364 రూపాయలు.
దేవరకొండ 16చెక్కులను గాను 1,601,856 రూపాయలు.
కొండమల్లేపల్లి 16 చెక్కులను గాను 1,601,856 రూపాయలు.
డిండి 09చెక్కులను గాను 901,044 రూపాయలు పంపిణీ చేశారు.
అనంతరం దేవరకొండ మండలంలోని శేరిపల్లి హరిజనవాడ లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, ఇంటి యాజమానికి శుభాకాంక్షలు తెలిపారు.
తాటికోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలూరు గిరి గౌడ్ నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో నారాయణ విద్యార్థుల ప్రభంజనం.




**కుత్బుల్లాపూర్. ఏప్రిల్ 29( మహ ప్రభ)** పదవ తరగతి ఫలితాలు బుధవారం వెలువడిన సందర్భంగా సుచిత్ర నారాయణ బ్రాంచ్ లో అందరూ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించగా గణేష్ కుమార్ అనే విద్యార్థి 590 మార్కులు (590/600) సాధించడం గమనార్హం . ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జె హేమలత మాట్లాడుతూ మా సుచిత్ర నారాయణ బ్రాంచ్ లో ప్రతి సంవత్సరం 100% విద్యార్థులు ఉత్తీర్ణత పొందుతారని ఈ యేట అందరూ విద్యార్థులు 580 మార్కుల పైబడి సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ముందు టపాసులు కాలుస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఏజీయం పురుషోత్తం రెడ్డి, కో ఆర్డినేటర్ కిరణ్ కుమార్, డీన్ సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

# పేద ప్రజల ప్రయాణానికి ప్రాణాధారం ఆర్టీసీ

-దానిని కాపాడటం మనందరి బాధ్యత
-కార్మికుల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదు
- ఎమ్మెల్యే బాలు నాయక్ భావోద్వేగ వ్యాఖ్యలు.




**దేవరకొండ ఏప్రిల్ 29( మహా ప్రభ)**
ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్చలు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ సిబ్బంది. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణం తీవ్ర విషాదకరం, వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా ప్రాణం అత్యంత విలువైనదన్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న వేదనను గుర్తుచేసుకుంటూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మరియు కార్మిక సంఘాలు కలిసికట్టుగా బాధ్యత తీసుకోవాలన్నారు. సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి, ప్రాణాలు తీసుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సరైన మార్గం కాదు. సమస్య ఎంత క్లిష్టమైనదైనా పరస్పర చర్చలతో పరిష్కారం సాధ్యమేనని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణలో ఎవరినీ శత్రువులుగా చూడదన్నారు.రాష్ట్రంలో ఆర్టీసీ అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉండటంతో, దాన్ని బలోపేతం చేయడం అందరి బాధ్యతగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ముఖ్య నాయకులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవాదళ్ సమర్థ-శిక్షణ శిబిరంలో పాల్గొన్న టీపీసీసీ నేతలు





**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 29 (మహాప్రభ )**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహిస్తున్న “సమర్థ-శిక్షణ శిబిరం”లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, మియాపూర్ యువనాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, సేవాదళ్ అనేది కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, క్రమశిక్షణ, సేవా భావం, త్యాగం అనే విలువలపై నిర్మితమైన శక్తివంతమైన వేదిక అని పేర్కొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడుతూ, స్వాతంత్ర్య సమరం నుంచి సామాజిక న్యాయం వరకు కీలక పాత్ర పోషించిందని తెలిపారు. “కాంగ్రెస్ అంటే సేవ... సేవ అంటే ప్రజల గెలుపు. ప్రజల పక్షాన పోరాటమే సేవాదళ్ ధర్మం” అని ఆయన అన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ప్రతి కార్యకర్తను సేవా దృక్పథంతో తీర్చిదిద్దడం ఈ శిక్షణ శిబిరం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ శిబిరం ద్వారా సేవాదళ్ కార్యకర్తలు నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యలపై అవగాహన, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను అలవరుచుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దే వేదికగా ఈ శిక్షణ శిబిరం నిలుస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు విజయభాస్కర్ రెడ్డి , సౌందర్య రాజన్ , ప్రణీత్, రత్నాచారి, సేవాదళ్ నాయకులు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు నిర్మూలించాలి

-సూపర్వైజర్.డి.చిట్టెమ్మ





**దేవరకొండ ఏప్రిల్ 29( మహాప్రభ )**
దేవరకొండ మండలం కర్నాటి పల్లి గ్రామం నందు మహిళల హక్కులపై బాల్యవివాహాల నిర్మూలనపై మారకద్రవ్యాలపై సైబర్ క్రైమ్ నేరాలపై.మిషన్ వాత్సల్య పథకం పై అక్రమ దత్తత పై చైల్డ్ హెల్ప్ లైన్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ సూపర్వైజర్ డి చిట్టెమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలనకు కృషి చేయాలని ఆమె తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు, దూరంగా ఉండాలనిసూచించారు , ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ కళావతి, టీ కళావతి, ఏ డబ్ల్యు హెచ్ , గ్రామంలోని కిషోర బాలికలు, తల్లులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు

# కుమ్మరి వృత్తిదారుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు డిమాండ్.




**హైదరాబాద్ - 29 ఏప్రిల్ (మహాప్రభ)**
ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ నాయకత్వంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కె. శ్రీనివాస్ తదితర రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రామనుకోలు వీరేశం, రాష్ట్ర కార్యదర్శి నాగపురి నగేష్, సహాయ కార్యదర్శి కొత్తపల్లి జయసింహా, రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ కృష్ణయ్య, యువత విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఏరుకొండ శ్రీనివాస్, వృత్తిదారుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు గుండాల గోవర్ధన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఖమ్మంపాటి సత్యనారాయణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు అగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నిర్ణయించబడిన ప్రకారం, తేదీ 17-05-2026న ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో 33 జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుంది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ మాట్లాడుతూ, కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మట్టి పాత్రల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కలిగే ప్రయోజనాలను వివరించి, కుమ్మరుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే 33 జిల్లాలలో ట్రైనింగ్ సెంటర్లను ప్రభుత్వం స్థాపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ, కుమ్మరి వర్గానికి సంబంధించిన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలో రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ పోస్టుల్లో కుమ్మరి వర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వంచే రావలసిన వాటాను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, రాబోయే సమావేశంలో ప్రధాన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

# మెగావత్ తండలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొనీ వధూవరులను ఆశీర్వదించిన వడ్త్య రమేష్



**దేవరకొండ( డివిజన్) ఏప్రిల్ 29( మహాప్రభ )**
నూతన వధూవరులను ఆశీర్వదించిన నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు మండల మాజీఅధ్యక్షుడు లోకసాని తిరుపతయ్య మాజీ సర్పంచ్ వెంకటేష్ బొల్లారం మాజీ సర్పంచ్ లాల్ సింగ్.నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు....

# రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కూకట్పల్లి ,ఏప్రిల్ 29 (మహ ప్రభ)**
గౌరవనీయులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారిని కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన వివిధ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించారు. ప్రజలకు మరింత చేరువగా ఉండే విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు సూచించినట్లు తెలిపారు.కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామాయంపేట్‌లో విద్యార్థులకు సైబర్, డ్రగ్స్‌పై అవగాహన.

**-డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత సహకారం అవసరం**
**-మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్ ఐపీఎస్.**





**మెదక్ జిల్లా -29ఏప్రిల్ (మహాప్రభ )**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రామాయంపేట్ పట్టణ పరిధిలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, డిజిటల్ లావాదేవీల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఈ-మెయిల్స్, లింక్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి గోప్యమైన వివరాలను ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వ్యాప్తి పెరుగుతోందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రమాదంలో పడతాయని తెలిపారు. చెడు స్నేహితుల ప్రభావానికి లోనుకాకుండా, తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని, తప్పుడు ప్రచారాలు, అసభ్యకర పోస్టులు, నకిలీ అకౌంట్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనుమానాస్పద సంఘటనలు గమనించినా, మత్తు పదార్థాల విక్రయాలపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐ బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుండ్లపల్లిలో బాలల సంరక్షణ కమిటీ సమావేశం

**-- బాల్య వివాహాలపై అవగాహన**
**-18 ఏళ్ల లోపు పిల్లలకు పనులు, మత్తు పదార్థాల అమ్మకాలపై కఠిన హెచ్చరిక**




**శివంపేట, ఏప్రిల్ 29(మహాప్రభ):**
శివ్వంపేట మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో గౌరవ సర్పంచ్ అధ్యక్షతన అంగన్వాడి టీచర్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం బాలల హక్కుల పరిరక్షణ తో పాటు బాల్య వివాహాలను అరికట్టడం మరియు చిన్నారులపై దృష్టి సారించడం. ఈ సందర్భంగా అధికారులు మరియు గ్రామ పెద్దలు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలను పనికి పంపకూడదని, బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలో 18 సంవత్సరాల లోపు పిల్లలకు మద్యం, సిగరెట్, గుట్కా వంటి మత్తు పదార్థాలను విక్రయించరాదని హెచ్చరించారు. ఎవరు ఈ నియమాలను ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు "ప్రజాప్రణాళిక -- 99 రోజులు" కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ, ఉప్పునూతల సత్యనారాయణ గౌడ్, దత్తాత్రేయ గౌడ్, పరశురాం, మాజీ సర్పంచ్ తాటి కిష్టయ్య, బజారి శ్రీనివాస్ రెడ్డి, బదారి మల్లారెడ్డి, గొర్రె సత్యనారాయణ రెడ్డి, ఎలుక ధర్మ రెడ్డి, మస్కూరి ప్రేమ్ దాస్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


# పిల్లుట్ల గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు...



**శివంపేట,ఏప్రిల్ 29 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో శివ్వంపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పిల్లుట్ల గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ ఆధ్వర్యంలో ఐకెపి కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి,మాజీ ఎంపీపీ హరికృష్ణ, శివంపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రమణ గౌడ్, చింత స్వామి, బుర్ర పోచగౌడ్ , ఏపిఎం పేంటేష్, సి సి భాగ్య,విజయలక్ష్మి, పార్వతి,రమాదేవి, పిల్లి మధు, గుర్రాల గణేష్, గుల్లయిగారీ రవి , అరవింద్, శివకుమార్,చింత భాగయ్య ,సంద్ర శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు మరియు గ్రామంలో ఉన్నటువంటి రైతులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది... ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ గారు మాట్లాడుతూ ఐకెపి కేంద్రంలోకి వచ్చినటువంటి వడ్లని తొందరగా కొనేలా ఏర్పాట్లు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేడ్ ఏ వడ్లకు 2389/- రూపాయలు సాధారణ రకం వడ్లకు 2369 రూపాయల కనీస మద్దతు ధర కనిపిస్తుంది... అదేవిధంగా సన్నరకం వరి ధాన్యం క్వింటాలుకు బోనస్ 500/- రూపాయలు ఇస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# పక్కగా జనగణన జరగాలి.

**-సజావుగా ధాన్యం కొనుగోలు.**
**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్..**



**మెదక్ జిల్లా -29ఏప్రిల్ (మహాప్రభ )**
పక్కాగా జనగణన జరగాలని , ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ సిబ్బందికి సూచించారు. బుధవారం నిజాంపేట మండల కేంద్రంలో జనగణన తీరును డోర్ టు డోర్ తిరిగి పరిశీలించారు. అనంతరం ఫ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. జనగణను పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రజల నుంచి పూర్తి సమాచారాన్ని రాబట్టాలని, జనగణనలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి తూకం ప్రక్రియను పరిశీలించారు. సరిగా తూకం వేయాలని, సజావుగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్దుర్తి జడ్‌పీహెచ్‌ఎస్‌కు 100% ఫలితం

**- పదవ తరగతిలో ఘన విజయం**
**-150 మంది విద్యార్థులందరూఉత్తీర్ణులు**
**-మండల టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు**




**నర్సాపూర్ ఏప్రిల్ 29(మహాప్రభ):**
ఈ సంవత్సరం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. మొత్తం 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, అందరూ ఉత్తీర్ణులు కావడంతో పాఠశాల 100% ఫలితాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ, ఈ విజయం విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం కలిసి సాధించిన గొప్ప ఫలితమని తెలిపారు. మండల స్థాయిలో గోటిముకలా అక్షయ 560 మార్కులతో మొదటి స్థానం, శెట్టి మేఘన 556 మార్కులతో రెండవ స్థానం, రాగుల లిప్సిక 553 మార్కులతో మూడవ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. అదనంగా 42 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించడం ప్రత్యేక విశేషం. ఉపాధ్యాయులు తమ అనుభవాన్ని వినియోగించి విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయడం, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ప్రత్యేక శ్రద్ధ చూపించడం వల్లే ఈ విజయ గాథ సాధ్యమైందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సహకారం కూడా ఈ ఫలితానికి కీలకమైందని తెలిపారు. శ్రీపాఠశాల ఉపాధ్యాయ బృందం సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ 100% ఫలితం సాధ్యమైందని, ఇది భవిష్యత్తులో మరిన్ని విజయాలకు బాటలు వేసే గొప్ప ఆరంభమని అభిప్రాయపడ్డారు.

# భక్తితో కూడిన విద్య..100% ఉత్తీర్ణత...

**-విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన గురుపీఠం ట్రస్ట్ ఫౌండర్ & చైర్మన్,హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్...**



**శివంపేట,ఏప్రిల్ 29 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని గూడూరులో గల కస్తూర్బా బాలికల వసతి గృహంలో గల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు ముందు కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాల గూడూరు విద్యార్థులు నిరంతరంగా శ్రీ గురు పీఠంలోని దత్తాత్రేయ మహాస్వామి పంచాయతీనము మరియు శ్రీ షిరిడి సాయి బాబా అర్చన ఆరాధనలో పాల్గొని తమందరిని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తమ శ్రేణులుగా ఉత్తీర్ణులవుటకు గురువులను పదేపదే భక్తిశ్రద్ధలతో ప్రేమతో కోరినందువల్ల ఆ శ్రీ దత్తాత్రేయ మహాస్వామి గురుపరంపర గురుదేవులు మరియు శ్రీ షిరిడి సాయిబాబా ఆశీస్సులు వారిపై పుష్కలంగా వర్షించి అత్యుత్తమైన మార్కులతో 100% ఉత్తీర్ణతను సాధించడం హర్షించదగిన విషయం. విద్యార్థులందరికీ ఆ దత్తాత్రేయ మహా స్వామి మరియు శ్రీ ము షిరిడి సాయిబాబా కృప ఎల్లవేళలా ఉండాలని బంగారు భవిష్యత్తు కలగాలని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యలను అభ్యసించి ఉన్నతమైన స్థానాన్ని పొందాలని శ్రీ గురుపిఠం చాటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆ గురుదేవులను ప్రార్థిస్తున్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గంలో సందడి చేసిన సుహాసిని రెడ్డి





**పలు వివాహ వేడుకల్లో వధూవరులకు ఆశీర్వాదం**

**నర్సాపూర్ ఏప్రిల్ 29(మహాప్రభ):**
నర్సాపూర్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరైన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

- నర్సాపూర్‌లో SR కన్వెన్షన్‌లో రుస్తుంపేట్ గ్రామానికి చెందిన నందిని -- నాగరాజు వివాహానికి హాజరై అభినందనలు తెలిపారు.
- నర్సాపూర్ పట్టణంలోని న్యూ క్లాసిక్ గార్డెన్స్‌లో చిన్నచింతకుంట గ్రామానికి చెందిన ప్రవలిక -- గోపాల్ గౌడ్ వివాహానికి హాజరై ఆశీస్సులు అందించారు.
- ఆనంద్ గార్డెన్స్‌లో ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన పాదంగల్ల మల్లేష్ -- అనుజల వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.
- పెద్ద చింతకుంట శ్రీనివాస గార్డెన్స్‌లో రెడ్డిలల్లి గ్రామానికి చెందిన రాజు -- స్వాతి వివాహ వేడుకలో పాల్గొన్నారు.
-తూప్రాన్ లక్ష్మి గార్డెన్స్‌లో ఉసిరికపల్లి గ్రామానికి చెందిన ప్రసన్న కుమారి -- మహేష్‌ల వివాహానికి హాజరై అభినందనలు తెలిపారు.
-గాజ్వేల్‌లో లక్ష్మన్ గార్డెన్స్‌లో గౌడవెల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమార్ -- కావ్యశ్రీ వివాహానికి హాజరయ్యారు.
-నాచారం ఎం.ఎం గౌడ్స్ గార్డెన్స్‌లో కొప్పులపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ గౌడ్ -- అఖిల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.


ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, శివంపేట్ మండల అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల అశోక్, రెడ్డిపల్లి సర్పంచ్ అశోక్, అల్లీపూర్ శ్రీనివాస్, కొట్టాల రమేష్, నవంబ్‌పేట్ అశోక్, సాయి శరణ్ గౌడ్, దాడిగే నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు సల్ల, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**గంగాధర, -29ఏప్రిల్ (మహాప్రభ )**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం రంగారావుపల్లె గ్రామంలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు సల్ల ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మౌనిక, ఉపసర్పంచ్ ద్వావ బహదూర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. కూలీల ఆరోగ్య రక్షణ కోసం వేసవి కాలంలో ఇలాంటి చర్యలు అవసరమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# బిజినెస్

## ఫోన్‌పేకు 5 కోట్ల మంది మర్చంట్లు



**న్యూఢిల్లీ**

డిజిటల్ చెల్లింపుల దిగ్గజం ఫోన్‌పే 5 కోట్ల మంది రిజిస్టర్డ్ మర్చంట్‌ల మైలురాయిని చేరుకున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 98 శాతం పిన్ కోడ్‌లలో విస్తరించిన ఫోన్‌పే.. చిన్న వ్యాపారులకు కేవలం పేమెంట్స్ మాత్రమే కాకుండా ఇన్సూరెన్స్, లోన్ల వంటి పూర్తిస్థాయి ఆర్థిక సేవలను అందిస్తోందని ఆ సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఈ ప్రయాణం క్యూఆర్ కోడ్‌తో మొదలై ఇప్పుడు అతిచిన్న వ్యాపారులను కూడా అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకువచ్చిందన్నారు.

## కుప్పకూలుతున్న బంగారం, వెండి.. భారీగా తగ్గిన ధరలు.. ఎంత తగ్గిందంటే

మహిళలకు శుభవార్త చెబుతున్నాయి బంగారం, వెండి ధరలు. ఏప్రిల్ 29, 2026 (బుధవారం) నాటి తాజా సమాచారం ప్రకారం, బంగారం, వెండి ధరలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా ధరలు కొంత తగ్గుముఖం పట్టాయి. గతంలో వినియోగదారులకు చుక్కలు చూపించిన గోల్డ్, సిల్వర్ ధరలు.. ప్రస్తుతం భారీ స్థాయిలో దిగి రావడం ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయనే చెప్పాలి. హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు భారీగానే తగ్గాయి. హైదరాబాద్– 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,350 (సుమారు రూ.2,540 తగ్గింది). 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,50,930 (సుమారు రూ.2,770 తగ్గింది).

ఢిల్లీ -- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,490 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,51,070 వద్ద కొనసాగుతోంది. ముంబై– 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,340 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,50,920 వద్ద కొనసాగుతోంది.



చెన్నై -- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,990 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,53,810 వద్ద కొనసాగుతోంది.

**వెండి ధరలు (1 కేజీకి):**
వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల స్వల్ప మార్పులు కనిపించినప్పటికీ, సగటు ధరలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్/విజయవాడలో కిలో బంగారం ధర రూ.2,69,900. ఉండగా, దేశవ్యాప్తంగా సగటు: రూ.2,60,000 నుండి రూ.2,65,000 మధ్యలో ఉంది.

**అంతర్జాతీయ ప్రభావం:** అమెరికా డాలర్ బలోపేతం కావడం, గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గుల వల్ల పసిడి ధరలపై ఒత్తిడి పెరిగింది. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్నప్పటికీ, ధరలలో వచ్చిన ఈ తాత్కాలిక తగ్గుదల కొనుగోలుదారులకు కొంత ఊరటనిస్తోంది. ప్రస్తుతం ధరలు గరిష్ట స్థాయిలోనే ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా పెట్టుబడిదారులు బంగారంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల సంకేతాలు, స్థానిక మార్కెట్‌లో లోయర్ డిమాండ్, అనిశ్చితి వంటివి ఈ పతనానికి కారణమయ్యాయి.


## సిగరేట్ తాగేవారికి బిగ్ షాకింగ్ న్యూస్..

**-మరోసారి పెరగనున్న ధరలు..! మే నెలలోనే..**

సిగరేట్ తాగేవారికి మరోసారి షాక్ తగలనుంది. వీటి ధరలు మరోసారి పెరిగే అవకాశముందని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో ఫిబ్రవరి 1 నుంచి ధరలు పెరిగాయి. దీంతో పొగవారి మరింత ఖర్చు అవుతుంది. అయితే మేలో సిగరేట్ ధరలు మరోసారి పెరగవచ్చని చెబుతున్నారు. దీనికి కారణం సేల్స్ తగ్గడమే. కేంద్రం జీఎస్టీ పెంచడంతో ధరలు పెరగడంతో సిగరేట్ తాగేవారు తగ్గిపోయారు. సేల్స్ తగ్గిపోవడంతో కంపెనీలకు నష్టాలు వస్తున్నాయి. దీనిని భర్తీ చేసుకునేందుకు ధరలను మరోసారి పెంచాలని కంపెనీలు భావిస్తున్నాయి.

**16 శాతం పెరిగే అవకాశం**

మేలో సిగరేట్ ధరలు 17 శాతం పెరగవచ్చని




చెబుతున్నారు. దీంతో పొగతాగేవారి జేబుకు చిల్లులు పడనున్నాయి. కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరి 1 నంచి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీని 30 నుంచి 40 శాతానికి పెంచింది. దీంతో కంపెనీలు సిగరేట్ ధరలను పెంచాల్సి వచ్చింది. దీని వల్ల సిగరేట్ అమ్మకాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. కింగ్ సైజ్ సిగరెట్ ధర రూ. 20 నుంచి రూ. 28కి పెరిగింది. ప్రస్తుతం గోల్డ్ ఫ్లేక్ ప్రీమియం ప్యాక్ రూ.115గా ఉండగా.. రూ.135కి పెరగనుందని తెలుస్తోంది. మార్ల్‌బరో, గోల్డ్ ఫ్లేక్ కింగ్స్, క్లాసిక్ వంటి సిగరేట్ల ధరలు మళ్లీ పెరగనున్నాయి. ఇక ఇతర బ్రాండ్ల సిగరేట్ల ధరలు కూడా పెరిగే అవకావముందని తెలుస్తోంది. సిగరేట్ ధరలు పెరిగితే.. తక్కువ ధర గల బ్రాండ్ల వైపు ప్రజలు మొగ్గు చూపవచ్చు. దీని వల్ల సిగరేట్ వినియోగం కూడా తగ్గే ఛాన్స్ ఉంది. తక్కువ ధర కలిగిన సిగరేట్ బ్రాండ్లకు డిమాండ్ పెరగనుంది. కంపెనీలు ధరలను పెంచి లాభాల కోసం చూస్తుండగా.. తాగేవారికి మాత్రం భారం పడనుంది. అయితే సిగరేట్ల ధరలు పెరగనున్నాయనే కారణంతో స్టాక్ మార్కెట్లో సిగరేట్ కంపెనీల షేర్లు పెరిగాయి. ఏప్రిల్ 29న ఐటీసీ షేర్ 4 శాతం పెరిగింది. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ షేర్ కూడా 6.5 శాతం పెరిగింది.

# స్పోర్ట్స్


## ఈ-సిగరేట్ తాగుతూ కెమెరాకి దొరికిన రియాన్ పరాగ్

ఐపీఎల్ 2026లో అదిరిపోయే విజయాలతో దూసుకుపోతున్న రాజస్థాన్ రాయల్స్ టీమ్.. పంజాబ్ కింగ్స్ విజయాల పరంపరకు బ్రేక్ వేసి పాయింట్ల పట్టికలో తన సత్తా చాటింది. అయితే ఈ సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మంగళవారం న్యూ చండీగఢ్ వేదికగా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. అయితే రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ జరుగుతుండగా డ్రెస్సింగ్ రూమ్‌లో రియాన్ పరాగ్ వేపింగ్ (ఈ–సిగరేట్) చేస్తూ కనిపించాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ పక్కన ఉండగానే పరాగ్ ఈ–సిగరేట్ తాగుతూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అధికృత ప్రాంతాలు మినహా.. ఛేజింగ్ రూమ్‌లలో లేదా మైదానాల్లో ధూమపానంకు అనుమతి లేదు. అదే సమయంలో 2019 నుంచి భారత్‌లో ఇ సిగరేట్ల విక్రయం, వాడకం పైనా నిషేదం ఉంది. ఒకవేళ పరాగ్ ఇ-సిగరేట్ తాగాడని తేలితే మాత్రం భారతదేశం ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం 2019 కింద



అతడికి శిక్ష పడే అవకాశం ఉందని అంటున్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష, భారీ జరిమానా విధించబడతాయి. అంతేకాకుండా బీసీసీఐ కూడా అతడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో ఆర్‌ఆర్ 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఇదే తొలి ఓటమి. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో మార్కస్ స్టోయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (59; 44 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) లు హాఫ్ సెంచరీలు చేశారు. కూపర్ కొన్నోలీ (30; 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (29; 11 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా రెండు వికెట్లు తీశాడు. జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 223 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆర్‌ఆర్ బ్యాటర్లలో డోనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (51; 27 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ (43 ; 16 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు), శుభమ్ దుబే (31 నాటౌట్; 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడారు. పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ మూడు, అర్షదీప్ సింగ్ ఓ వికెట్ పడగొట్టాడు.

## సూర్యవంశీపై గవాస్కర్ ప్రశంసల వర్షం



ఐపీఎల్ 2026 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. మంగళవారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 16 బంతుల్లో 5 సిక్సర్లు, 3 ఫోర్లతో 43 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ.. ఈ సీజన్లో 400 పరుగుల మైలురాయిని అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో కేవలం 167 బంతుల్లోనే 400 పరుగులు పూర్తి చేసి.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా (238.09 స్ట్రైక్ రేట్‌తో) ఈ ఘనత సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడుతున్న తీరుపై టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. "వైభవ్ కొడుతున్న షాట్లు అద్భుతం. అతని కోసం బౌండరీ లైన్ వద్ద 10 మంది ఫీల్డర్లను పెట్టినా ఆపడం అసాధ్యం. అతను దేనికీ భయపడటం లేదు. ఇంత చిన్న వయసులో ఉండటం వల్ల వచ్చే ప్రయోజనం అదే కాబోలు. ఎదురుగా ఉన్నది ఏ బౌలర్ లేదా ఏ జట్టు అని అతను ఆలోచించడం లేదు, కేవలం బంతిని మాత్రమే చూస్తున్నాడు" అని కొనియాడారు. వైభవ్ దూకుడు ఐపీఎల్‌లోని మిగిలిన జట్లకు పెద్ద సవాల్‌గా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో వైభవ్ సూర్యవంశీ ఇచ్చిన ఆరంభం ఎంతో కీలకంగా మారింది. పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వేసిన తొలి ఓవర్‌లోనే 6, 4, 4 బాది వైభవ్ సూర్యవంశీ తన ఉద్దేశాన్ని చాటాడు. లాకీ ఫెర్గూసన్, మార్కో జాన్సెన్ వంటి మేటి బౌలర్లను కూడా లెక్కచేయకుండా భారీ సిక్సర్లు బాదాడు. కేవలం 3.2 ఓవర్లలోనే రాజస్థాన్ 50 పరుగుల మార్కును దాటడం వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసానికి నిదర్శనం. చివరికి డోనోవన్ ఫెరీరా, శుభమ్ దూబే అద్భుతమైన పోరాటంతో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. యశస్వి జైస్వాల్ (51), రియాన్ పరాగ్ (29) కూడా రాణించడంతో పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ మొదటి ఓటమిని చవిచూసింది. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 ఏళ్ల వయసులోనే దిగ్గజాల ప్రశంసలు అందుకోవడమే కాకుండా, పరుగుల వేటలో అగ్రస్థానంలో కొనసాగుతుండటం విశేషం.

## చెపాక్ దేశంలోనే అత్యంత చెత్త వేదిక

**-ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్**

ఐపీఎల్ 2026లో భాగంగా ఆర్సీబీ తరపున ఆడుతూ అదరగొట్టేస్తున్న ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తాజాగా చేసిన కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో పెనుదుమారం రేపుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో భారత్‌లోని వివిధ క్రికెట్ స్టేడియాలకు ర్యాంకులు ఇవ్వాలని ఆయనను కోరగా.. చెన్నై సూపర్ కింగ్స్ హోమ్ గ్రౌండ్ అయిన ఎం.ఏ. చిదంబరం స్టేడియం (చెపాక్)ను దేశంలోనే అత్యంత చెత్త వేదికగా పేర్కొన్నాడు. ఒకప్పుడు తను కూడా ఇదే చెన్నై జట్టుకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. తన ర్యాంకింగ్స్‌లో దానికి చివరి స్థానం ఇవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. సాధారణంగా చెపాక్ స్టేడియం స్పిన్నర్లకు అనుకూలంగా ఉండి, తక్కువ స్కోర్లు నమోదయ్యే వేదికగా పేరుగాంచింది. అయితే ఓ స్టార్ పేసర్‌గా హేజిల్‌వుడ్‌కు అక్కడి పరిస్థితులు ఏమాత్రం నచ్చలేదని




స్పష్టమవుతోంది. "బ్లైండ్ ర్యాంకింగ్" ప్రక్రియలో భాగంగా స్టేడియాల పేర్లు అడగగా.. చెన్నై మైదానాన్ని అతను ఏమాత్రం సంకోచించకుండా పదో స్థానంలో (చివరి స్థానం) ఉంచాడు. స్పిన్ మాయాజాలం ఎక్కువగా ఉండే ఈ పిచ్‌పై పేసర్లకు పెద్దగా పని ఉండకపోవడమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. మరోవైపు బ్యాటర్లకు స్వర్గధామంగా, బౌలర్లకు పీడకలగా భావించే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియాన్ని హేజిల్‌వుడ్ తన ఫేవరెట్ వేదికగా మొదటి స్థానంలో నిలిపాడు. చిన్నస్వామి స్టేడియంలో బౌండరీలు చాలా దగ్గరగా ఉన్నప్పటికీ.. అక్కడి దక్కన్ నేల అందించే అదనపు బౌన్స్ తనలాంటి పొడవైన బౌలర్లకు వికెట్లు తీయడానికి ఎంతో సహకరిస్తుందని హేజిల్‌వుడ్ వివరించాడు. తన టాప్–3 జాబితాలో చిన్నస్వామితో పాటు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం, ముంబైలోని వాంఖడే స్టేడియాలను చేర్చడం గమనార్హం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. పేసర్లకు అత్యంత అనుకూలంగా ఉండే ధర్మశాల, కోల్‌కతా (ఈడెన్ గార్డెన్స్), లక్నో (ఎకానా) వంటి స్టేడియాలను హేజిల్‌వుడ్ తన జాబితాలో కింది స్థానాల్లో ఉంచాడు. ఇటీవల ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నాలుగు వికెట్లు తీసి ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించినప్పటికీ.. ఆ మైదానానికి కేవలం 9వ ర్యాంక్ మాత్రమే ఇచ్చాడు. గాయం నుంచి కోలుకుని అద్భుత ఫామ్‌లో ఉన్న హేజిల్‌వుడ్.. ధోనీ కోటపై చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సీఎస్కే, ఆర్సీబీ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీశాయి.

# అనకాపల్లి'లో సంగీత ఉగ్రరూపం..
# గూస్ బంప్స్ తెప్పిస్తున్న అమ్మోరు దిగినాది సాంగ్




నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా ఫేమ్ యాక్టర్ విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'అనకాపల్లి' . ఇంటెన్స్ పల్లెటూరి యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతున్నట్టు ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. విక్రమ్ సాహిదేవ్ తన సరికొత్త లుక్, పవర్‌ఫుల్ యాక్టింగ్‌తో ఇంప్రెస్ చేస్తున్నాడు. ఈ వేసవి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఈ మూవీ నుంచి అమ్మోరు దిగినాది సాంగ్‌ను విడుదల చేశారు.శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటలో సీనియర్ నటి సంగీత ఉగ్రరూపం చూడొచ్చు. అగ్రెసివ్‌గా మంగ్లీ వాయిస్‌తో సాగుతున్న ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలువనుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఓ జాతరను చూస్తున్నామా..? అన్నట్టుగా సాగుతున్న ఈ పాట మ్యూజిక్ లవర్స్‌కు కనెక్ట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీలో త్రినాధరావు నక్కిన, ఇంద్రజ అబ్బర్, మహబూబ్‌నగర్ భాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాండ్రేగుల నాయుడు, నందినీ రాయ్, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రాన్ని నక్కిన నరేటివ్స్, భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాండ్రేగుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు త్రినాథరావు నక్కిన స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించగా.. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నాడు. డావ్‌జాండ్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నాడు.



కుర్రకారును రెచ్చగొడుతున్న రాశి సింగ్.

# పాత్ర కోసం రిస్క్‌కు వెనకాడని రష్మిక




పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.




# అది నా పెద్ద తప్పు, ఆ సమయంలో నా మైండ్ పని చేయలేదు.

## ఫరియా అబ్దుల్లా ఎమోషనల్

బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం (మే 1 విడుదల) ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది.ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది.కథలు ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త ఊపునివ్వాలని భావిస్తోంది.మరి ఏం జరుగుతుందో చూడాలి.

# నెట్‌ఫ్లిక్స్‌కు ఫిక్సయిన డెకాయిట్




టాలీవుడ్ యువ కథానాయకుడు అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం మంచి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. విడుదలై మూడు వారాలు దాటినా కూడా వారాంతాల్లో గట్టి కలెక్షన్స్ రావడం ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందనేది తెలియజేస్తుంది. ఈ విజయానికి ప్రధాన కారణం హీరో అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ అభినయం. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం సినిమా భావోద్వేగాలను మరింత ఎలివేట్ చేసింది. కథలో యాక్షన్, ఎమోషన్, ప్రేమ వంటి అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఇప్పుడు ఇదే చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా అప్‌డేట్స్ ప్రకారం, మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ రిలీజ్ దాదాపు ఖరారైనట్టే తెలుస్తోంది.థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మరోసారి ఈ యాక్షన్ ప్రేమకథను ఆస్వాదించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు.

## బాలీవుడ్‌లో మైథలాజికల్ జంగిల్ డ్రామా?



తమిళ అగ్ర కథానాయకుడు ధనుష్ హీరోగా బాలీవుడ్‌లో ఓ మైథాలాజికల్ జంగిల్ డ్రామా తెరకెక్కనున్నది. కోలీవుడ్ ఫిల్మ్ మేకర్ పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి బాలీవుడ్ అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాత. ఈ ప్రాజెక్ట్‌కు హీరోగా ముందు రామ్‌చరణ్‌ను అనుకున్నారట. కొన్ని కారణాల వల్ల చర్చలు కార్యరూపం దాల్చకపోవడంతో ఈ సినిమా ధనుష్ కాంపౌండ్‌కు చేరిందంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి.ఓ పౌరాణిక గాథ ఆధారంగా అటవీ నేపథ్యంలో ఈ కథ సాగుతుందట. దర్శకుడు పీఎస్ మిత్రన్ తమిళంలో తెరకెక్కించిన ఇరుంబు తిరై, సర్దార్ చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో పాటు భన్సాలీతో ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా ఈ ప్రాజెక్ట్ మిత్రన్‌కి దక్కిందని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com